పర్మిషన్ వస్తే ప్రారంభమే..!

ఈసీఐఎల్‌లో కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ

- తాత్కాలిక భవనంలో 50 సీట్లతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- ఎన్‌ఎంసీ అనుమతిస్తే 2024–25 ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు
- కుత్బుల్లాపూర్‌లో శాశ్వత భవన నిర్మాణానికి 20 ఎకరాల స్థలం కేటాయింపు
- ప్రిన్సిపాల్‌తో సహా అధ్యాపకుల నియామకాలు పూర్తి
- ప్రాథమిక సదుపాయాల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి
- కళాశాలకు అనుబంధంగా మల్కాజిగిరి ప్రభుత్వ ఏరియాస్పత్రి
- 70 నుంచి 220 కి పెంచిన పడకల సంఖ్య



ఈసీఐఎల్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనం

సాక్షి, సిటీబ్యూరో: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో తాత్కాలికంగా ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్‌ఎంసీ అనుమతిస్తే ఈ విద్యా సంవత్సరం 2024–25 నుంచే 50 సీట్లతో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టేందుకు సన్నద్ధంగా ఉన్నారు. ఇప్పటికే కొత్త వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ డాక్టర్ మురళీకృష్ణను నియమించారు. దీంతోపాటు తరగతుల నిర్వహణకు అనువైన భవనాన్ని గుర్తించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం తాత్కాలికంగా ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ భవనాన్ని ఎంపిక చేసి అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నది. ప్రిన్సిపాల్‌తో సహా పలు విభాగాల అధ్యాపకుల నియామకాల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఫర్నీచర్, ల్యాబ్‌లతో పాటు మెడికల్ కాలేజీకి కావాల్సిన పరికరాలను సమకూర్చుతోంది. ప్రైవేట్ భవనంలో నిర్వహించనున్న మెడికల్ కాలేజీని ఇప్పటికే సందర్శించిన జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ), మరోదఫా కూడా పరిశీలిస్తుందని, వారి నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఎంబీబీఎస్‌లో మొదటి ఏడాదిలో 50 సీట్లతో తరగతులు ప్రారంభిస్తామని అధికార వర్గాలు పేర్కొంటోంది. క్రమంగా సీట్ల సంఖ్యను పెంచనున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ రాక, అడ్మిషన్ల ప్రక్రియ మొదలుతో మల్కాజిగిరి జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

కుత్బుల్లాపూర్‌లో మెడికల్ కాలేజీకి 20 ఎకరాల స్థలం

సామాన్యులకు కూడా వైద్య విద్యను అందించాలనే ఉద్దేశంలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీ చొప్పున మంజూరు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కొత్త మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ నేపథ్యంలోనే మెడికల్ కాలేజీ నిర్మాణానికి స్థానికంగా 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించింది.అయితే అక్కడ మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయ్యేవరకు తాత్కాలికంగా ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో తరగతులు నిర్వహించనున్నారు.

అనుబంధంగా మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రి

ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా మల్కాజిగిరిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఎంపిక చేసిన జిల్లా అధికార యంత్రాంగం పడకల సంఖ్య పెంపునకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం 70 పడకలు ఉండగా, ఆ సంఖ్యను 220 పడకలకు పెంచినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు. అలాగే పడకల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు, పరికరాలు, వైద్యులు, సిబ్బంది సంఖ్యను కూడా పెంచారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్వహణ కోసం రిక్రూట్ చేసిన ప్రిన్సిపాల్‌తో సహా అధ్యాపకులు ప్రస్తుతం మల్కాజిగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కేంద్రంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎస్ఎంఆర్ వినయ్ సిటీ అధ్యక్షుడిగా..

కింగ్ జాన్సన్ కొయ్యడ

సాక్షి, సిటీబ్యూరో: మియాపూర్‌లోని ఎస్ఎంఆర్ వినయ్ సిటీ గేటెడ్ కమ్యూనిటీ (స్కోవా)లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో.. అధ్యక్షుడిగా కింగ్ జాన్సన్ కొయ్యడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని స్కోవా ఎన్నికల సంఘం ఆదివారం అధికారికంగా వెల్లడించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు జాన్సన్ మాట్లాడుతూ..గత నాలుగేళ్ల నుంచి మెయింటెనెన్స్ పెంచకుండా..అభివృద్ధి పనుల్ని చేపట్టడం వల్ల నివాసితులు తమపై నమ్మకం ఉంచారని తెలిపారు. ప్రధాన కార్యదర్శి సురేష్, కోశాధికారి ఎం.నవీన్ మాట్లాడుతూ.. త్వరలో పలు అభివృద్ధి పనుల్ని చేపడతామని చెప్పారు.

నూతన కమిటీ సభ్యులు వీరే..

అధ్యక్షుడిగా కింగ్ జాన్సన్ కొయ్యడ, ఉపాధ్యక్షుడిగా హిమాన్షు, ప్రధాన కార్యదర్శి సురేష్, కార్యదర్శి సతీష్ వావ్‌ధానే, జాయింట్ సెక్రటరీ దీపక్ ఖత్రీ, ట్రెజరర్ ఎం నవీన్, జాయింట్ ట్రెజరర్ అంకుర్ అగర్వాల్, కమిటీ సభ్యులుగా సింధూరి, మధుమితా నాయక్, ధనుంజయ్ పాణిగ్రాహి, అర్ధెందు శేఖర్ దాస్, కె హిమబిందు, నితిన్ మిశ్రా, ఆనంద్ పాండే, శామ్యూల్ బీరా ఎన్నికయ్యారు.

ఆగస్టు 8,9 తేదీల్లో చలో ఢిల్లీ

పంజగుట్ట: ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ సంఘాల జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని మాదిగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 8, 9వ తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మా దిగలను ఓటు బ్యాంకుగా వాడుకునేందుకు కుట్ర చేసిందని అందుకు పావులా మందకృష్ణను వాడుకుంటున్నారు. మందకృష్ణ మాదిగ మౌనం వీడి బిజేపీ చేసిన మోసాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మస్తాన్ రెడ్డి

మోతీనగర్: శ్రీ వివేకానందనగర్ కాలనీ వాసులకు సేవ చేయాలనే లక్ష్యంతోనే అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచానని అధ్యక్ష అభ్యర్థి దేవరింటి మస్తాన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం స్థానిక శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం కమిటీ హాల్‌లో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ వార్డు కార్యాలయం కొనసాగుతున్నందున కాలనీ వాసులు కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకోవాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. కమిటీ హాల్‌ను అందుబాటులోకి తీసుకువస్తానని తెలిపారు. కాలనీలోని ఆలయాల్లో పూజారులకు సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆలయ పూజారులకు నివాసం కల్పించటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ వాసులకు సరిపడా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. విద్యుత్, వీధి లైట్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వి టీం ఏర్పాటు చేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఆగస్టు 4న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం



కూకట్‌పల్లి డీఎం హరి



డీఆర్ఎం ఆపరేషన్స్ కవిత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డిపో పరిధిలోని ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 9959226151 నంబర్ ద్వారా కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరిని సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అదే విధంగా కూకట్‌పల్లి, జీడిమెట్ల, మియాపూర్ 2, హెచ్‌సీయూ, మేడ్చల్ ప్రాంత ప్రయాణికుల సమస్యలను డయల్ యువర్ ఆఫీసర్ కార్యక్రమం ద్వారా కూకట్‌పల్లి డివిజన్ అధికారి డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆపరేషన్స్ ఆర్. కవిత పరిష్కరించనున్నారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు 9959226148 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అంజయ్యనగర్‌లో..



పూజలు చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, నాయకులు



ఘనంగా ఫలహారం బండ్ల ఊరేగింపు



ఫలహారం బండి ఊరేగింపును ప్రారంభిస్తున్న బండి రమేష్, కర్క వేణుగోపాల్

బాలానగర్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఫతేనగర్ డివిజన్‌లో సోమవారం రమేష్ బస్తీ నాయకుల ఆధ్వర్యంలో అమ్మవారి ఫలహారం బండిని ఊరేగించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, దేవుళ్ల వేషధారణతో సందడి నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, ప్రభుత్వ సలహాదారు కర్క వేణుగోపాల్ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించి, ఫలహారం బండిని ప్రారంభించారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో తివారి, లక్ష్మణ్‌రాజు ముదిరాజ, డివిజన్ అధ్యక్షుడు రమేష్, మాధురి రాము, వెంకటేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..

మూసాపేట: మూసాపేటలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. మూసాపేట చౌరస్తా నుంచి జనతానగర్ చిత్తారమ్మ దేవాలయం వరకు సాగిన ఊరేగింపులో పోతురాజుల నృత్యాలు, కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తూము శ్రీనివాస్‌రావు, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు తూము నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి జిల్లా జీత్‌రావు, నర్సింగ్, శ్రీనివాస్, జగదీష్, బాబురావు, వేణు, యువక మండలి అధ్యక్షులు తూము మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదవబస్తీ ఆధ్వర్యంలో....

మూసాపేట యాదవ బస్తీలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ పగడాల బాబూరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..



యాదవ సంఘం ఆధ్వర్యంలో..

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ



వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న కేల వెంకట్రావు

మోతీనగర్: దివ్యాంగులను మనలో ఒకరిగా చూడవలసిన బాధ్యత అందరిపై ఉందని లయన్స్ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ శాఖ అధ్యక్షుడు కేల వెంకట్రావు అన్నారు. సోమవారం అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లో దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం సామాన్య కార్యకర్తగా లయన్స్ క్లబ్‌లో సభ్యత్వం పొంది వివిధ హోదాల్లో పనిచేస్తూ తనకు చేతనైన సహాయాన్ని చేస్తున్నట్లు తెలిపాడు. గతంలో బాలానగర్‌లో తాత్కాలిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ, నిరుపేదలకు తాత్కాలిక నివాసం సైతం నిర్మించినట్లు తెలిపాడు. కార్యక్రమంలో నారయణమ్మ, వెంకటేశ్వర్లు, బొడ్డు బుచ్చయ్య, చిరంజీవి, గొర్ల సత్యనారాయణ, వెంకటేష్, మురళి, శ్రీను, రాంబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన కొత్తగొల్ల రమేష్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ చికిత్స నిమిత్తం రాందేవ్ రావ్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. అతడి కుటుంబ సభ్యులు సమస్యను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించాడు. ఇందుకు సంబంధించి అతడికి రూ. 30 వేలు మంజూరయ్యాయి. సోమవారం జీవీఆర్ కార్యాలయంలో బండి రమేష్‌తో కలిసి ఆయన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, మేకల రమేష్, ఫణి కుమార్, వాసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న లయన్ అన్నెం కోటిరెడ్డి, వంశీధర బాబు తదితరులు

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, అందుకోసం ప్రతి ఒక్కరూ గుడ్డతో తయారు చేసిన సంచులను వాడాలని లయన్స్ క్లబ్ ఆఫ్ పర్యావరణ పరిరక్షణ కమిటీ 320డి చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. సోమవారం లయన్స్ జిల్లా టి 20 కేబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంశీధర బాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులను పూర్తిగా నిషేధించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్లను నిషేధించినా అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా వాటి వినియోగం కొనసాగుతుందన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన 320డి జిల్లా కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడానికి పదవీ ప్రమాణం చేసిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో లయన్ సూరిరాజ్, విజయలక్ష్మీ, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యను పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసి వనం అపార్ట్‌మెంట్ ఎదురుగా ట్రాఫిక్ సమస్య కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని శేరిలింగంపల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్‌ను కోరారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం ట్రాఫిక్ ఏసీపీ, జీహెచ్‌ఎంసీ అధికారులు తులసివనం ప్రాంతంలో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు. అపార్టుమెంట్ ఎదురుగా వేగంగా వచ్చిపోయే వాహనాలను అరికట్టడానికి స్పీడ్ బ్రేకర్లు, డివైడర్లను ఏర్పాటు చేయాల్సిందిగా శిరీష కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, సీఐ, ఎస్ఐ, జీహెచ్‌ఎంసీ అధికారులు, తులసివనం వాసులు పాల్గొన్నారు.

నేడు హెచ్‌సీయూలో సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌ను మంగళవారం 'లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఇనిషియేటివ్ (లైఫ్)' అనే థీమ్‌తో నిర్వహించనున్నారు. 'వికసిత్ భారత్–2047'లో భాగంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)చే ప్రారంభించబడింది. వాతావరణ మార్పు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ఆర్థిక చిక్కులు, సాంకేతిక ఆవిష్కరణలు, ఇంధన భద్రత, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై వివిధ దేశాల విద్యార్థి ప్రతినిధులు చర్చించనున్నారు. దాదాపు 40 నుంచి 50 మంది విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.ఈ కార్యక్రమానికి హెచ్‌సీయూ అర్థశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చిట్టేడి కృష్ణారెడ్డి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

జలమండలి అధికారుల వివరాలు..

హఫీజ్‌పేట్: హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి శేరిలింగంపల్లి డివిజన్‌లో మంచినీటి, సివరేజ్ సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయవచ్చు..

శేరిలింగంపల్లి డివిజన్ జనరల్ మేనేజర్ బ్రిజేష్ :	9989989679
మాదాపూర్ సబ్ డివిజన్	
శరత్‌కుమార్‌రెడ్డి (డీజీఎం, మాదాపూర్) :	9989988370
బి. యాదయ్య (మేనేజర్, మాదాపూర్) :	9154297400
నరేందర్‌రెడ్డి (మేనేజర్, గచ్చిబౌలి) :	7331185784
అభిషేక్ (మేనేజర్, నల్లగండ్ల) :	9154867438
సందీప్‌కుమార్ (మేనేజర్, కొండాపూర్):	9550731232
విక్రమ్‌రెడ్డి (మేనేజర్, డోయన్స్):	9989989382
చందానగర్ సబ్ డివిజన్ వెంకటేశ్వర్లు (డీజీఎం, మియాపూర్) :	9989997518
వి. సాయిచరిత (మేనేజర్, మియాపూర్):	9154866702
ఎస్‌వీఎస్ సుబ్రమణ్యంరాజు (మేనేజర్, చందానగర్) :	9989989045
బిక్కులాల్ (మేనేజర్, దీప్తిశ్రీనగర్):	7995010492
పూర్ణేశ్వరి(మేనేజర్, హఫీజ్‌పేట్):	7331185747
ఆర్సీపురం సబ్ డివిజన్ శివకృష్ణ (డీజీఎం):	7337350848
మంచినీటి ట్యాంకర్ కోసం :	155313

హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల పరిశీలన



రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కాశీనాథ్

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను సుమారు రూ.26.6 కోట్లతో చేపట్టడం జరిగిందని సౌత్ సెంట్రల్ రైల్వే జెడ్ఆర్ యుసీసీ మెంబర్ డి.కాశీనాథ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను స్టేషన్‌మాస్టర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా, నాణ్యత పాటిస్తూ పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

పార్కులో నిలిచిన వర్షపు నీరు



నిజాంపేట్: పార్కుల నిర్వహణ విషయంలో సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్కులో వరదనీరు నిలిచిపోయింది. పార్కు చిన్నపాటి కుంటను తలపిస్తుండటంతో వాకర్స్, సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వరదనీరు చేరి తాము ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు చర్యలు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు పార్కులో వరదనీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దానం



సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని శ్రీరామలింగేశ్వర దేవస్థానం ప్రాంగణంలో కొలువుదీరిన భూలక్ష్మి అమ్మవారిని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త విశాల్ సూదం ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేస్తూ విశాల్ సూదంకు అభినందనలు తెలిపారు. అంతకుముందు భక్తుల సమక్షంలో రంగం కార్యక్రమం జరిగింది. అమ్మవారి ముందు స్వర్ణలత నిలబడి పూజలు బాగా జరిగాయి..వర్షాలు బాగా పడతాయి..అని భవిష్యవాణి వినిపించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

హఫీజ్‌పేట్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఓల్డ్ ఎంఐజీ నల్లగండ్ల అండర్‌బ్రిడ్జి కింద గుర్తు తెలియని వృద్ధుడు (65) శనివారం ఉదయం పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనం అతడిని గమనించి పరిశీలించగా గాయాలతో పడి ఉండడం గుర్తించారు. వెంటనే చికిత్స కోసం 108 అంబులెన్స్ సహాయంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఒంటిపై నల్ల ప్యాంటు, బ్లూ కలర్ షర్ట్ ఉన్నాయన్నారు. అతడి వివరాలు తెలిస్తే చందానగర్ పోలీసులకు తెలియజేయాలని కోరారు.